క్లుప్తంగా

యూరియాను అధికంగా వాడొద్దు


మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

దొనకొండ: రైతులు తమ పంట పొలాల్లో యూరియాను అధికంగా వాడకూడదని జిల్లా వనరుల సహాయ వ్యవసాయ సంచాలకులు రామ్మోహన్‌రావు సూచించారు. మండలంలోని ఆరవల్లిపాడులో ఆయన రైతులకు శుక్రవారం సలహాలు, సూచనలు అందజేశారు. పత్తి పంటలో సూక్ష్మ పోషకాల లోపాలైన జింక్, బోరాన్, మెగ్నీషియం లోపాల గురించి తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. పత్తిలో రసం పీల్చే పురుగు, పచ్చ పురుగులు, తెల్లదోమ, తామర పురుగులతో కలిగే నష్టాలు వివరించారు. గులాబీ రంగు పురుగు ఉధృతి తగ్గించేందుకు లింగాకర్షణ బుట్టలను 30 రోజుల తర్వాత కట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ వి.బాలకృష్ణనాయక్, సిబ్బంది ధనరాజ్, యోగేశ్వరరావు, విన్నిబాబు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సర్పంచ్ మృతికి మాజీ ఎమ్మెల్యేల సంతాపం

మార్కాపురం: మార్కాపురం మండలం కోల భీమునిపాడు సర్పంచ్ సీహెచ్ సుబ్బారెడ్డి(55) శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మార్కాపురం, గిద్దలూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జులు, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి తదితరులు సుబ్బారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ లక్ష్మీదేవి కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు తుమ్మా వెంకటరెడ్డి, బొగ్గు రవిచంద్రారెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు


భారీగా హాజరైన ప్రజలు

- కరుణించిన వరుణుడు
- కూటమి కుట్రలు భగ్నం
- భారీగా హాజరైన నాయకులు, కార్యకర్తలు

వైఎస్సార్ సీపీ సమావేశానికి విశేష స్పందన





మాట్లాడుతున్న కారుమూరి, శ్యామల, బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి


వైఎస్సార్ సీపీ నాయకులను సత్కరిస్తున్న కార్యకర్తలు

దర్శి: పట్టణంలోని బూచేపల్లి నివాసంలో ఏర్పాటు చేసిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సభకు విశేష స్పందన లభించింది. శుక్రవారం స్థానిక బూచేపల్లి నివాసం వద్ద ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. తెల్లవారు జామున రెండు గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు పట్టణంలో భారీ వర్షం కురిసింది. 8 గంటల నుంచి వరుణుడు శాంతించాడు. దీంతో ఆగమేఘాల మీద సమావేశం ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టుదలతో వచ్చిన కార్యకర్తలందరూ సమావేశం ప్రాంతంలో మట్టి, బురద లేకుండా ట్రాక్టర్‌లతో డస్ట్ తోలించి కార్యకర్తలే స్వయంగా పట్టలు వేసి కుర్చీలు వేసి రెండు గంటల్లో సమావేశం ప్రారంభించారు. అందరూ కలిసికట్టుగా ఎలాగైనా సమావేశాన్ని సక్సెస్ చేయాలని కార్యకర్తల్లో నూతన ఉత్తేజం సంతరించుకుంది. నియోజవకవర్గంలోని ఐదు మండల కేంద్రాల నుంచి భారీగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కార్లు, ద్విచక్ర వాహనాలపై సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఐదు మండలాల నుంచి ఎవరికి వారు ద్విచక్ర వాహనాలపై నేరుగా సమావేశం హాలు వద్దకు చేరుకున్నారు. పట్టణంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడాన్ని అడ్డుకున్న కూటమి నాయకుల ఎత్తులను చిత్తు చేస్తూ పార్టీ కార్యాలయం నుంచి సమావేశం హాలు వరకు తమ అభిమాన నాయకులకు భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. జై జగన్, జై బూచేపల్లి..అని కార్యకర్తల నినాదాలతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ముఖ్య అతిథులుగా హాజరైన వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరు నాగేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు మాట్లాడుతున్నంత సేపు కార్యకర్తలు, నాయకులు కరతాళ ధ్వనులు, విజిల్స్‌తో సభాప్రాంగణం దద్దరిల్లింది. అతిథులను పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

కూటమి కుయుక్తులు భగ్నం

కూటమి ప్రభుత్వం చేసిన కుయుక్తులన్నీ భగ్నమయ్యాయి. అప్పటి వరకు కురిసిన వర్షానికి చల్లని గాలుల మధ్య రెండు గంటల వరకు జరిగిన సమావేశంలో కార్యకర్తలు తమ నాయకుల ప్రసంగాలను శ్రద్ధగా విన్నారు. వేలాది మంది కార్యకర్తలతో ఆ ప్రాంగణం అంతా కిక్కిరిసిపోయింది. గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను స్క్రీన్‌పై వేసి ప్రజలకు చూయించారు. చంద్రబాబు ఇచ్చిన 143 హామీలు, మ్యానిఫెస్టోలో ఉండే హామీల గురించి తెలుసుకునే క్యూ ఆర్ కోడ్‌ను విడుదల చేసి కార్యకర్తలకు పంచారు.

నేడు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సభ


వేదికను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- కార్యకర్తలను సమాయత్తం చేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: నియోజకవర్గ కేంద్రం యర్రగొండపాలెంలో శనివారం జరగనున్న బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నారు. గ్రామ స్థాయి నాయకుల నుంచి నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి పదవులు పొందిన నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమానికి స్వచ్ఛందంగా వచ్చే విధంగా ఆయన చర్యలు తీసుకుంటున్నారు. గ్రామంలోని ప్రతి వీధి నుంచి కార్యక్రమానికి కదలి రావాలని, దగా కోరు కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు చేస్తున్న వంచన తెలుసుకునేందుకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలి వచ్చేందుకు ఎమ్మెల్యేతో పాటు ఆయా మండలాల ప్రజా ప్రతినిధులు, నాయకులు సన్నాహాలు చేస్తున్నారు. స్థానిక త్రిపురాంతకం రోడ్డులోని వైష్ణవి గార్డెన్స్‌లో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల, జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి పాల్గొంటారని మండల పార్టీ కన్వీనర్ ఏకుల ముసలారెడ్డి తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి వచ్చే నాయకులు, కార్యకర్తలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామని, గ్రామ స్థాయిలో కొత్తగా ఎంపికైన నాయకులు సకాలంలో కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ఆటోవాలాల చైతన్యానికి స్పందన


రోడ్డుపై గుంతలు పూడ్చుకుంటున్న ఆటో డ్రైవర్లు (ఫైల్)


గుంతల రోడ్డును చదును చేయిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

యర్రగొండపాలెం: గుంతలతో కూడుకున్న రోడ్లపై తమ వాహనాలు నడపలేక ఆటో డ్రైవర్లే పుల్లలచెరువు రోడ్డుపై ఉన్న గుంతలు పూడ్చుకున్న సంఘటన గత నెల 29న 'సాక్షి'లో 'గుంతలు పూడ్చుకున్న ఆటో డ్రైవర్లు' శీర్షికన ప్రచురితమైన వార్తకు రోడ్లు, భవనాల శాఖాధికారులు స్పందించారు. ఈ మేరకు యర్రగొండపాలెం నుంచి పుల్లలచెరువుకు వెళ్లే రోడ్డును అభివృద్ధి పరిచేందుకు సన్నాహాలు చేశారు. తొలివిడతగా యర్రగొండపాలెం వైపు నుంచి 10 కిలో మీటర్ల వరకు తారు రోడ్డు వేసేందుకు రూ.2.85 కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి చేస్తామని ఆ శాఖాధికారి ఒకరు తెలిపారు.

వైఎస్సార్ సీపీ నేతలకు సన్మానం

తాళ్లూరు: స్థానిక బీవీఎస్ఆర్ నిలయం వద్ద శుక్రవారం బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ పేరుతో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన దర్శి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథులగా విచ్చేసిన ఆ పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్ సీపీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామలను మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి గజమాలతో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు ఆలోకం హరిబాబు, విద్యార్థి విభాగం అధ్యక్షుడు కైపు అశోక్‌రెడ్డి, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడు కొనికి గోవిందరాజు యాదవ్ ఉన్నారు.

దొనకొండ: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ పేరుతో శుక్రవారం దర్శిలో నిర్వహించిన కార్యక్రమానికి ఆ పార్టీ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 2 వేల మంది కార్యకర్తలు బయల్దేరి వెళ్లారు. వారిలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఇండ్ల శ్రీనివాసులు, దర్శి నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ కాలూరి రమణయ్య, జిల్లా యాక్టివిటీ సభ్యుడు బత్తుల వెంకట సుబ్బయ్య యాదవ్, కర్నాటి ఆంజనేయరెడ్డి, గుంటు జాకోబు, నూనె వెంకటరెడ్డి, తమ్మనేని సుబ్బారెడ్డి, పత్తికొండ వెంకట సుబ్బయ్య, యద్దనపూడి జాన్‌ప్రకాష్, బండారు రాజు, ఎగ్గోని కృష్ణారెడ్డి, గుంటు పోలయ్య, భీమిని వెంకటేశ్వర్లు, తాల్లూరి నగేష్, కసిబిసి నాగారాజు, పులిమి శివ, కె.ప్రసాద్ ఉన్నారు.


బూచేపల్లి, కారుమూరి, బత్తుల, శ్యామలను సన్మానిస్తున్న తాళ్లూరు నేతలు


కారుమూరిని సన్మానిస్తున్న కాకర్ల

కారుమూరిని కలిసిన కాకర్ల

జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావును మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, కాలూరి రమణయ్య, గుంటు జాకోబు, పులిమి శివ, ద్వారకచెర్ల చెంచిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి బొకేలు అందజేశారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి


రైతులతో వ్యవసాయాధికారులు

కురిచేడు: మండలంలోని పొట్లపాడులో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన–2025 కింద ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే పంటల్లో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. మండల వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ ఈ సంవత్సరం నల్ల బర్లీ పొగాకుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని తెలిపారు. పంట మార్పిడి, అంతర్ పంటలు, మిశ్రమ పంటలు సాగు చేస్తే కలిగే ఉపయోగాలు వివరించారు. వ్యవసాయ శాఖలో అమలులో ఉన్న పథకాలు, విత్తన సరఫరా అంశాల గురించి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయధికారి వీవీ శేషమ్మ మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల యాజమాన్యం చేపట్టడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. వరి, కంది, మిరప పంటల్లో విత్తనం వేసే దగ్గర నుంచి పంట కోత వరకు చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి, జీవన ఎరువుల ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం రైతులకు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే ముఖ్య పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల పరికరాలు ఇచ్చారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు మల్లికార్జున నాయక్, రైతులు పాల్గొన్నారు.

రైతుల మోముల్లో ఆనందం

- 15 మి.మీటర్ల వర్షపాతం
- కోతకు గురైన రోడ్డు
- నిండిన చెరువులు


జలమయమైన లోతట్టు ప్రాంతం


గొల్లపాలెం వద్ద కోతకు గురైన రోడ్డు

కురిచేడు: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షంతో రైతుల ముఖాల్లో ఆనందం కనిపిస్తోంది. ఎంతోకాలంగా వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్న రైతుల ఆశలు నెరవేరాయి. ఒక్కసారిగా 15 మి.మీటర్ల వర్షం పాతం ఇచ్చి వరుణుడు రైతుల మోముల్లో ఆనందాన్ని చూసినట్లయింది. రైతులు పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. సిద్ధం చేసుకున్న పొలాల్లో వేయాల్సిన విత్తనాల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. కొందరు రైతులు తమ భూములను దుక్కులు దున్ని పంటలు విత్తేందుకు అనువుగా సిద్ధం చేసుకుంటున్నారు. ఈ సీజన్‌లో కాస్త ఆలస్యంగా వర్షం కురవడంతో ఈ అదునులో ఏయే పంటలు సాగు చేయాలి, ఏ పంటలు సాగు చేస్తే తమకు అనుకూలంగా ఉంటుందనే విషయాలను వ్యవసాయాధికారులతో, పెద్దల నుంచి సలహాలు తీసుకుంటున్నారు. కురిచేడు నుంచి కాటంవారిపల్లెకు వెళ్లే రోడ్డు వర్షపు నీటి ప్రవాహానికి గొల్లపాలెం వద్ద కోతకు గురైంది. చెరువులు నిండి జలకళను సంతరించుకున్నాయి.


వై.పాలెంలో భారీ వర్షంతో నిండిన ఫారం పాండ్

వై.పాలెం ప్రాంతంలో భారీ వర్షం

యర్రగొండపాలెం: నియోజకవర్గ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. శుక్రవారం వేకువ జామున 2.30 గంటల నుంచి ఉదయం వరకు ఈ వర్షాలు ఎడతెరపి లేకుండా కురిసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని పొలాలు అదును కావడంతో ఖరీఫ్ పంటలు విత్తుకునేందుకు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే విత్తుకున్న పంటలకు, ఉద్యాన పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేకూర్చిందని ఏవో కె.నీరజ తెలిపారు. భారీ వర్షాల కారణంగా ఆయా ప్రాంతాల్లో రైతులు తీయించుకున్న ఫారం పాండ్స్ నిండాయని, కాలువలు పారడంతో నియోజకవర్గంలోని చెరువుల్లో కొద్దిపాటి నీరు చేరిందని ఉద్యాన శాఖాధికారి పి.ఆదిరెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు భూగర్భ జలాలు అడుగంటడంతో వ్యవసాయ బోర్ల నుంచి నీరు రావడం పూర్తిగా తగ్గిందని, ఈ వర్షాల కారణంగా బోర్లు రీచార్జి అయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు. యర్రగొండపాలెంలో 122.4 సెంటీ మీటర్లు, పుల్లలచెరువులో 49.4, త్రిపురాంతకంలో 6.2, పెద్దారవీడులో 42.8, పెద్దదోర్నాలలో 18.6 సెంటీ మీటర్ల ప్రకారం వర్షం కురిసినట్లు రికార్డ్ అయింది. వర్షం కారణంగా నియోజకవర్గంలో విద్యుత్‌లో తీవ్ర అంతరాయం కలిగింది. దాదాపు 3 గంటల పాటు విద్యుత్ నిలిచిపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సుస్థిర వ్యవసాయ పద్ధతులతో అధిక లాభాలు

పెద్దదోర్నాల: ఆదివాసీ గిరిజన రైతులు సుస్థిర వ్యవసాయ పద్ధతులతో అధిక లాభాలు పొందాలని ఐసీడీఎస్ సీడీపీఓ కమలకుమారి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో ఆరు గ్రామాల రైతులకు అవగాహన కల్పించారు. సీడ్లాయస్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీఓతో పాటు మండల వ్యవసాయ విస్తరణాధికారి చైతన్యకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం, చిరుధాన్యాల సాగు, ఇంటి ప్రాంగణంలో పోషక తోటల అభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గర్భిణులకు, తల్లులకు 18 రకాల కూరగాయల విత్తనాలు అందించారు. తల్లులు, గర్భిణులు ఐసీడీఎస్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. సీడ్లాయస్ సంస్థ ప్రోగ్రాం ఇంప్లిమెంటర్ వైశాలి, ఆర్ఓఎఫ్ఆర్ కో ఆర్డినేటర్ మంతన్న, బాలరాజు, పుష్పలత పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)
Office mail : sakshiongads@gmail.com

వాసవీ కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు


పూజలో పాల్గొన్న మహిళలు

చీమకుర్తి రూరల్ (సంతనూతలపాడు): సంతనూతలపాడులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆషాడ మాసం పూజల్లో భాగంగా శుక్రవారం రాత్రి శాకాంబరీదేవి అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు పూజలందుకున్నారు. ఆలయ అర్చకుడు నేలబొట్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని కూరగాయలు, పండ్లతో అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనగా, ప్రసాదాలు పంపిణీ చేశారు.